క్లుప్తంగా

ఆటోయూనియన్ కార్యవర్గం ఎన్నిక

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి లోని కాకతీయ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొమ్మటి కార్తీక్, గౌరవ అధ్యక్షుడిగా గుళ్లపెల్లి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా రవికుమార్, కార్యదర్శిగా చిలకలపల్లి వీరస్వామి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

శివాలయంలో పూజలు

పర్వతగిరి: మండల కేంద్రంలోని పర్వతాల శివాలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు పాల్గొనగా అర్చకులు హర్షవర్ధన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెలలో నిర్వహించే అన్నదానం కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 500 మంది భక్తులు పాల్గొనగా వరంగల్‌కు చెందిన సిద్ధం రజితనరేష్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ భక్త మండలి సభ్యులు దిండి సురేశ్, రవితేజ, వేణుగోపాల్, సోమేశ్వరరావు, రాజు, జనార్ధన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిద్ధేశ్వరుడికి..

చెన్నారావుపేట : శ్రావణమాసంలో మొదటి సోమవారం పాడ్యమిని పురస్కరించుకొని స్థానిక శ్రీసిద్ధేశ్వరాలయంలో సిద్ధేశ్వరుడికి విశేష అభిషేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయఅర్చకులు భిక్షమయ్యశాస్త్రి, గణేశ్‌శాస్త్రి, నరేశ్‌శాస్త్రిలు అభిషేక పూజలు చేశారు. భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

గణితఫోరం మండల కమిటీ ఎన్నిక



సంగెం: తెలంగాణ గణిత ఫోరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.సత్యమూర్తి(జెడ్పీహెచ్ఎస్, గవిచర్ల), సెక్రటరీగా కోర్నెలు(జెడ్పీహెచ్ఎస్,సంగెం) ఉపాధ్యక్షులుగా పి.శ్రీధర్(మోడల్ స్కూల్, గవిచర్ల), బి.శిరీష(కేజీబీవీ, సంగెం)కోశాధికారిగా బి.రమేశ్ (జెడ్పీహెచ్ఎస్, కాట్రపల్లి)లను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు సత్యమూర్తి తెలిపారు.


బ్యాంకు ఏపీకేతో మోసం

నల్లబెల్లి: వాట్సప్‌లో యూనియన్ బ్యాంకు ఏపీకే ఇన్‌స్టాల్ చేసుకొని సులువుగా లావాదేవీలు నిర్వహించుకోవచ్చని వాట్సప్‌లో వచ్చిన సందేశాన్ని చదివి ఓపెన్ చేసిన పాపానికి ఓ కూల్‌డ్రిక్ వ్యాపారి రూ.17,541 మోసపోయిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు కథనం ప్రకారం నల్లబెల్లికి చెందిన పిన్నింటి మధు వాట్సప్‌లో వచ్చిన సందేశాన్ని చదివి యూనియన్ బ్యాంకు పేరుతో వచ్చిన ఏపీకేను ఈ నెల 4న ఓపెన్ చేశాడు. అయితే వెంటనే తనబ్యాంక్ అకౌంట్ నుంచి రూ.17,541 విత్‌డ్రా అయినట్లు ఎస్ఎంఎస్ వచ్చింది. వెంటనే అప్రమత్తమైన మధు తన అకౌంట్లో ఉన్న రూ.13 వేలను తన కుటుంబ సభ్యుల ఖాతాకు పంపించుకున్నాడు. మోసపోయానని గ్రహించి 1903 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి జరిగిన మోసాన్ని వివరిస్తూ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

పరిశుభ్రత పాటించాలి

వర్ధన్నపేట: ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాలవికాస కోఆర్డినేటర్ పిట్టల రాణి కోరారు. సోమవారం మండలంలోని దివిటిపల్లిలో బాలవికాస ఆధ్వర్యంలో హనుకొండలోని శ్రీలక్ష్మీనర్సింహ ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ సామాజిక స్పృహతో గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. బాలవికాస సీసీ ఫాతిమా, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాడిపశుపోషణతో ఆర్థికాభివృద్ధి చెందాలి



సంగెం: మహిళలు వ్యవసాయానుబంధంగా పాడిపశువుల పోషణతో ఆర్థికాభివృద్ధిని సాధించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజు అన్నారు. సోమవారం శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో మండలానికి 109 పాడిపశువుల యూనిట్లు మంజూరు కాగా లబ్ధిదారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మేలు జాతి పాడి పశువుల ఎంపిక, పెంపకం, పాలదిగుబడి, పోషణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి డాక్టర్ రాజేశ్‌రెడ్డి, ఎంపీఎం కిషన్, ఎంఎస్ అధ్యక్ష కార్యదర్శులు కల్యాణి, రాజమణి పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్ కార్యాలయం

- చిన్న వర్షానికే కురుస్తున్న గదులు
- భయంభయంగా కాలం వెళ్లదీస్తున్న అధికారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం

నర్సంపేట రూరల్ : పాలకులు మారుతున్నారు.. అధికారులు మారుతున్నారు...కానీ తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం మంజూరు చేసిన దాఖలాలు లేవు. నిత్యం రిజిస్ట్రేషన్‌లతో ఆదాయం సమకూరుతున్నప్పటికీ, ప్రజలతో రద్దీగా ఉండే కార్యాలయం అయినప్పటికీ పట్టింపు లేకుండా పోయింది. ఏన్నో ఏళ్ల కింద నిర్మించిన భవనం రోజు రోజుకు శిథిలావస్థకు చేరుతూనే ఉంది. తహసీల్ కార్యాలయం చిన్న పాటి వర్షానికే కార్యాలయంలోని గదులన్ని కురుస్తుంటాయి.. పెచ్చులూడి కిందపడిపోతున్నాయి. అధికారులు భయంతో కాలం వెళ్లదీస్తున్నారు.

నర్సంపేటలో అందరికీ అందుబాటులో తహసీల్దార్ కార్యాలయంలో ఉంది. దీన్ని ఆనుకొని పోలీస్‌స్టేషన్ ఉంటుంది. మండలంలోని 26 గ్రామపంచాయతీలతో పాటు, నర్సంపేట పట్టణానికి చెందిన భూ రికార్డులు, రేషన్, ఓటరు ఐడీ, మీసేవలో అన్ని రకాల ధృవీకరణ పత్రాలు, ధరణి పోర్టల్‌తో రద్దీ పెరిగింది. నిత్యం ప్రజలతో కార్యాలయం కళకళలాడుతూ ఉంటుంది. ఈ ఆఫీస్ నుంచి ప్రభుత్వానికి ఆదాయం ఉన్నప్పటికీ కనీసం భవన సదుపాయం కల్పించలేకపోయింది. ఉన్నతాధికారులు,



పెచ్చులూడిన స్లాబ్ పైకప్పు

ప్రజాప్రతినిధులు మారినప్పుడల్లా నూతన భవనం కోసం దరఖాస్తులు చేస్తూనే ఉన్నారు. కాని నేటి వరకు భవనం మంజూరు కాలేదు. సుమారు 50 ఏళ్ల క్రితం బిల్డింగ్ కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలం వచ్చిందంటే తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తడుస్తూ ఉంటాయని, దీంతో విలువైన రికార్డులను సైతం కోల్పోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నూతన భవనాన్ని మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

భవనం పూర్తిగా దెబ్బతింది



తహసీల్ కార్యాలయానికి విద్యార్థులు, రైతులు, ప్రజలు పలు సమస్యలు విన్నవించేందుకు, సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ల కోసం వస్తుంటారు. కాని ఆ భవనం పూర్తిగా దెబ్బతినడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని జంకుతున్నారు. భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మించాలి.

– బొట్ల నరేశ్, విద్యార్థి సంఘం నాయకుడు

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న గౌడ కులస్తులు

చెన్నారావుపేట: స్థానికంగా ఉన్న కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గీత కార్మికులు సోమవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఆలయం లేక 15 ఏళ్లుగా స్వామి వారి ఉత్సవాలు నిర్వహించలేదన్నారు. ఆలయంతో పాటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఈ నెలలోనే ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గౌడ సంఘం అధ్యక్షుడు జోరు వీరయ్యగౌడ్, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, దొంతి శ్రీనివాస్, గొడిశాల మల్లయ్యగౌడ్, సురేందర్, దొంతి సంతోష్ గౌడ్, మాచర్ల ఎల్లగౌడ్, సాంబయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే జల్లి గ్రామంలోని 144, 74 సర్వే నంబర్‌లోని భూమికి సంబంధించి రైతులకు పట్టా పాస్ బుక్‌లు ఇప్పించాలని సోమవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మాధవరెడ్డి తహసీల్దార్‌తో మాట్లాడి రైతుల వద్ద ఏవైతే పట్టా పాస్‌పుస్తకాలు, పహాణీలు లేని యెడల తహసీల్దార్‌కు అప్లికేషన్ పెట్టుకోవాలని తెలిపారు. రైతులు శ్రీని వాస్, విజేందర్, బాలరాజు, శ్రీనివాస్, కుర్ర ప్రభాకర్, మంద బిక్షపతి, తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

కేరళ బాధితులకు అండగా నిలుద్దాం



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నర్సంపేట: కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంత వరద బాధితులకు అండగా నిలవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అన్నారు. పట్టణంలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయనిధి కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కేరళలో ప్రకృతి విలయతాండవం సృష్టించి వర్షాలు రావడం వల్ల కొండచరియలు విరిగి వరద నీరు వచ్చి అనేక గ్రామాలు మునిగిపోయిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటి వరకు దాదాపు 360 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందారన్నారు. అనేక మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వరద బాధిత కుటుంబాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి కేరళ ప్రభుత్వానికి సీపీఎం రాష్ట్ర కమిటీ ద్వారా పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, నాయకులు అనిల్, జగన్నాథం, కార్తీక్, నరేష్, ఎండి.ఫరీదా, విజయ, స్వప్న, నాగమణి, ఇంద్ర, లక్ష్మి, యాకలక్ష్మి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ది కృషితోనే మెడికల్ కళాశాల



సంబురాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపురం: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషితోనే నర్సంపేటకు మెడికల్ కళాశాల వచ్చిందని, ఎంతో మంది వైద్య విద్యార్థులకు ఉపయోగపడనుందని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో అనేక మంది నిరుపేద విద్యార్థులు వైద్య వృత్తిలో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. మెడికల్ కళాశాల ఉద్యోగాల్లో పక్షపాతం చూపిస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్వీ డివిజన్ నాయకులు వినయ్, హేమంత్, అజహర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యం

వర్ధన్నపేట : అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలంగాణ అంబేడ్కర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య అన్నారు. సోమవారం వర్ధన్నపేటలో ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయడంలో భాగంగా తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్రంలో మరింత బలోపేతం చేయడానికి గ్రామ, మండల జిల్లా కమిటీలను పునర్నిర్మాణం చేయడానికి నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులపై సీఎం మాటలు సరికాదు

దుగ్గొండి: ప్రైవేట్ ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతినేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం సరికాదని ప్రైవేట్ టీచర్స్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా ప్రతినిధి సింగనబోయిన శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు, అధికారుల పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారని అక్కడ డీగ్రీ ఫెయిల్ అయిన వారు చదువు చెబుతున్నారని హేళనగా మాట్లాడటం సరైందని కాదన్నారు. ప్రైవేట్‌పాఠశాలల్లో చదివి నేడు ఎంతో మంది అత్యున్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. పోరాడి సాధించిన తెలంగాణకు సీఎంగా ఉండి ప్రైవేట్ టీచర్లకు మంచి చేయాల్సింది పోయి విమర్శించడం తగదన్నారు. ఇప్పటికైనా సీఎం ప్రైవేటు ఉపాధ్యాయుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో స్వచ్ఛత పాటించాలి



పర్వతగిరి : ర్యాలీ నిర్వహిస్తున్న మండల ప్రత్యేక అధికారి సంజీవరెడ్డి



ఖానాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న స్పెషల్ ఆఫీసర్లు



దుగ్గొండి: పొనకల్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ అరుంధతి, అధికారులు

పర్వతగిరి: వర్షాకాలంలో గ్రామాల్లో స్వచ్ఛత పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి సంజీవరెడ్డి సూచించారు. మండలంలోని 33 గ్రామాల్లో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు. శంకర్‌నాయక్ ఎంపీడీఓ ఎం.శంకర్‌నాయక్, పాల్గొన్నారు.

సంగెం: పారిశుద్ధ్యం నిర్వహణతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కట్టడి చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీఓ వేదవతి అన్నారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొముర‌య్య, ఎంఎన్‌ఓ నర్సింహాచార్యులు, పాల్గొన్నారు.

అమీనాబాద్‌లో ర్యాలీ

చెన్నారావుపేట: మండలంలోని అమీనాబాద్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం రవి, యమున, హెల్త్ అసిస్టెంట్ లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి: పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమంలో స్వచ్ఛందంగా ప్రజలు పాల్గొనాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్ కోరారు. సోమవారం మండలకేంద్రంలో, కొలన్‌పల్లిలో పాలకుర్తి సోమనాథ ఆలయచైర్మన్ టీఎం కృష్ణమాచార్యులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీఓ కూచన ప్రకాష్, పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలి

ఖానాపురం : గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ సౌజన్య అన్నారు. మండల వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీఓ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన స్వచ్ఛదనం..పచ్చదనం

దుగ్గొండి: మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామసభలు నిర్వహించారు. అన్నీ గ్రామాలలో మొక్కలు నాటారు. పొనకల్‌లో ఎంపీడీఓ లెక్కల అరుంధతి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్‌కుమార్, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీఓ శ్రీదర్‌గౌడ్, ఏపీఓ శ్రీనివాస్, పాల్గొన్నారు.

నెక్కొండ : వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి అన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభి, మాట్లాడారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గీసుకొండ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



నర్సంపేట రూరల్‌లో..

నర్సంపేట రూరల్/గీసుకొండ : నర్సంపేట మండలంలోని గురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు గీసుగొండ మండలం కొమ్మాల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం సన్నిధిలో, గీసుకొండ మండలం ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాల 1998-99 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి గుర్తులు నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, బండారి సూర్యప్రకాశ్, జగన్నాథాచారి, ముప్పు రవి, చంద్రమౌళి, కుమారస్వామి, రమాదేవి, అనితాదేవి, మంగమ్మ, విజ యశ్రీ, పద్మావతి, ఇందిర, పాల్గొన్నారు. ధర్మారంలో అప్పటి హెచ్ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పండుగలు సంప్రదాయాలకు ప్రతీక

నెక్కొండ: పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని మదర్‌థెరిస్సా హైస్కూల్ ప్రిన్సిపాల్ చల్లా యాకుబ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు నిర్వహించారు. పుర వీధుల్లో ఉపాధ్యాయులు,విద్యార్థులు బోనాలతో ఊరేగించారు. పాఠశాల డైరెక్టర్ చల్లా మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలకు సన్నాహకం

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవాల కోసం గ్రామంలోని పలు కమిటీలు కలిసి సన్నాహకంపై సోమవారం చర్చించాయి. 1949వ సంవత్సరంలో ఆవిర్భవించిన ప్రభుత్వ బడి వేడుకలతో ఆనాటి గురువులను సత్కరించుకోవాలని సమావేశంలో తీర్మానించారు. ఆనాటి పూర్వ విద్యార్థులు సుమారు 43 బ్యాచ్‌ల్లోని వారు పలు సూచనలు, సలహాలు అందించారు. అడ్‌హక్ కమిటీని నియమించారు. కార్య నిర్వాహక అధ్యక్షుడిగా మోడెం కుమారస్వామి తో పాటు 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

తపాలా సేవలు సద్వినియోగించుకోవాలి

నల్లబెల్లి : గ్రామీణ ప్రాంత ప్రజలు తపాలా శాఖ సేవలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పరకాల ఉపవిభాగం సహాయ పర్యవేక్షకుడు అనంతరాం నాయక్ అన్నారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని రంగాపురంలో తపాలా శాఖ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తపాలా శాఖ పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడే పథకాలను కొనసాగిస్తుందన్నారు.

వసతి గృహాలను పట్టించుకోని అధికారులు



వర్ధన్నపేట : ప్రభుత్వ వసతి గృహాలను అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యలు పేరుకుపోయి విద్యార్థులు నానాఅవస్థలు పడుతున్నారని విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కార్యదర్శి ఇస్లావత్ కల్యాణ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వసతిగృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల ఆవరణలో గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచి పాములు, తేళ్లకు నిలయాలుగా మారాయన్నారు. సరైన మూత్రశాలలు, స్నానపు గదులు లేకపోవడంతో పాటు నీరు సక్రమంగా రావడం లేదన్నారు. ఈ సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధు, రామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా లింగాచారి

నల్లబెల్లి: మండలంలోని రేలకుంట విశ్వబ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రీపెల్లి లింగాచారిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ధనుషనాదుల సతీష్ చారి, ప్రధాన కార్యదర్శిగా కుంటమల్ల సమ్మయ్య, కార్యదర్శులుగా కందుకూరి ఓంకార చారి, పోలోజు భద్రయ్య చారి, సలహాదారులుగా శ్రీపెల్లి రాజన్న చారి, శేఖర చారి, ధనుషనాధుల సందీప్ చారి, నరేష్ చారి, కస్పోజ్జుల రాజేష్‌చారి ఎన్నికయ్యారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

పర్వతగిరి: ఎస్సైగా బోగం ప్రవీణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఇక్కడ ఉన్న ఎస్సై గుగులోతు వెంకన్న ఏసీబీ దాడుల్లో దొరకగా ఆత్మకూరులో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌ను సీపీ అంబర్‌కిశోర్ ఝా పర్వతగిరికి బదిలీ చేశారు.

బదిలీ ఓ మజిలీ

దుగ్గొండి: ఉద్యోగ జీవితంలో బదిలీ అనేది ఓ మజిలీ లాంటిదని ఎంపీడీఓ లెక్కల అరుంధతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏఈగా పనిచేసిన హరిదాస్యం వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ వీరన్న, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్‌లు ఇటీవల బదిలీ అయ్యారు. సోమవారం కార్యాలయంలో బదిలీ వీడ్కోలు సభను నిర్వహించారు. బదిలీపై వెళ్లిన అధికారులకు ఎంపీడీఓ, ఎంపీఓ శ్రీధర్, ఏపీఓ శ్రీనివాస్ శాలువాలు, పూలమాలతో సత్కరించారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం

నర్సంపేట రూరల్ : మండలంలోని ఇప్పల్‌తండా శివారులోని కొండసముద్రం తండా ప్రాథమిక పాఠశాలలో గత 13 ఏళ్లుగా పనిచేసి నల్లబెల్లి మండలంలోని మేడపల్లి పాఠశాలకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు పజారి రవిని సోమవారం ఘనంగా సన్మానించారు. నూతనంగా పాఠశాలకు హెచ్ఎంగా వచ్చిన సారంగపాణిని పూలమాలతో, శాలువాతో ఘనంగా సన్మానించారు.పీజీహెచ్ఎం మంగ్య, విజయ, కీర్య, మూర్య, రవి, హరియా, అలోజి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ఐశ్వర్యకు ఎల్లోబెల్ట్




నెక్కొండ: నేషనల్ షోటోకాన్ కరాటే చాంపియన్‌షిప్‌లో నెక్కొండ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఐశ్వర్య ప్రతిభ కనబరిచిందని ప్రధానోపాధ్యాయుడు రంగారావు అన్నారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 5 వరకు వరంగల్‌లో నిర్వహించిన చాంపియన్‌షిప్-2024 పోటీల్లో ఐశ్వర్య ఎల్లోబెల్ట్ సాధించిందని తెలిపారు. అనంతరం ఐశ్వర్యను ఆయన అభినందించారు. స్టాఫ్ సెక్రటరీ ఇమ్మానియేల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రాధిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన తక్కళ్లపెల్లి సుధాకర్‌రావు సతీమణి అంజనీదేవి, మునుకుంట్ల దేవేందర్ తల్లి ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకునన బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సోమవారం వారి కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నాంపెల్లి యాకయ్య, రాయపురం కుమారస్వామి, అడ్డగట్ల రాజేంద్రప్రసాద్, చీపురు వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం



నర్సంపేట: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ కంబాల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా కండక్టర్ గొలనకొండ వేణు ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగులంతా కలిసి రూ.70వేల ఆర్థికసాయం అందజేశారు. శ్రీనివాస్ దశదిన కర్మ సోమవారం నిర్వహించగా డిపో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, అద్దె బస్సు డ్రైవర్లు, ఇతర డిపో ఉద్యోగులు పాల్గొని మృతుని కూతరు సాయిప్రియ పేరు మీద రూ.70వేల బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్‌ను అందజేశారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్లబెల్లి: మండల కేంద్రానికి చెందిన వడ్లూరి సత్యం ఇటీవల ఆత్మహత్య చేసుకోగా తనతో కలిసి చదువుకున్న 1997-98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు స్నేహితుడి కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. దశదినకర్మ కార్యక్రమానికి వారు హాజరయ్యారు.

ర్యాలీని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రణయ్‌దీప్

నర్సంపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుకు కృతజ్ఞతగా పట్టణంలో ఈనెల 8న నిర్వహించే ధర్మ విజయ ప్రజాప్రదర్శన ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణయ్‌దీప్ మాట్లాడుతూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు న్యాయాన్ని, ధర్మాన్ని బతికించిందన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ తడుగుల విజయ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, శ్రీకాంత్, రవి, శ్రీనివాస్, సుధాకర్, సంతోష్, నరేశ్, వినోద్, వివేక్, తదితరులు పాల్గొన్నారు.